క్లుప్తంగా

బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ కారుపాకల రాజయ్య ఆధ్వర్యంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో దాదాపు 100మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ, సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లింక్‌రోడ్లు పరిశుభ్రంగా ఉండాలి



పరిశీలిస్తున్న కమిషనర్ రాజశేఖర్

సుల్తానాబాద్: పట్టణానికి వచ్చే లింక్ రోడ్లు పరిశుభ్రంగా ఉండేలా సిబ్బందితో చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని పూసాల, శాస్త్రినగర్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పూసాల నుంచి ఇళ్లలోకి వచ్చే రహదారి రైస్‌మిల్లుల వద్ద రోడ్లు ఆక్రమణలకు గురవుతోందని పలువురు ఫిర్యాదు చేయడంతో రోడ్డును పరిశీలించారు. రైతులకు అవసరమయ్యే రోడ్లను శుభ్రపరచడమే కాకుండా అక్రమాలను తొలగిస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా చెత్తను ఎప్పటికప్పుడు వార్డుల్లో నుంచి తొలగించి డంపింగ్ యార్డుకు తరలించాలని, ప్లాస్టిక్ సింగిల్ యూజ్ కవర్లను వేరు చేసి అందించాలని కోరారు. వార్డ్ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, వార్డ్ ఆఫీసర్ వినోద్, శానిటేషన్ సిబ్బంది ఆనంద్ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేసున్న కృతిక

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొగర్రాయి గ్రామానికి చెందిన గడ్డం అనిల్‌గౌడ్ తన కూతురు కృతిక పుట్టినరోజు సందర్భంగా యాచకులకు, పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్‌కుమార్, సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేగోళం శంకర్‌గౌడ్, కోల విజయ్‌గౌడ్, చిలుక శ్రీను, మామిడి అజయ్, సాయి, సంతోష్, హరీశ్ పాల్గొన్నారు.

దుస్తులు అందజేత



దుస్తులు అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని విఠల్‌నగర్‌లోని అమ్మపరివార్ ఆశ్రమంలో ఉన్న చిన్నారులకు మంగళవారం సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి చంద్రమౌళి ఆధ్వర్యంలో దుస్తులు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు నాగరాజు, నర్సయ్య, శ్రీకాంత్, సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి పాల్గొన్నారు.

బ్యూటీషియన్ ఉచిత కోర్సు ప్రారంభం



జ్యోతినగర్: విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ ఉచిత కోర్సును మంగళవారం ప్రారంభించారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ అన్నపూర్ణకాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో మహిళలకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ఉచిత బ్యూటీషియన్ కోర్సును కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ ప్రారంభించారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఎడెల్లి శ్యామ్, ఆర్పీలు స్వప్న, ధనలక్ష్మి, ఫర్జానా, శిక్షకులు సరిత, మంగ పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం..

కార్పొరేషన్ మూడో డివిజన్ న్యూపోరట్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యా దినోత్సవం



యైటింక్లయిన్‌కాలనీ: న్యూమారేడుపాకలో ర్యాలీ



ఎలిగేడు: ర్యాలీలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు



మంథని: మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శైలజ



జ్యోతినగర్: స్కూల్ యూనిఫాం పంపిణీ



రామగుండం: ఉత్తమ టీచర్‌కు సన్మానం



కాల్వశ్రీరాంపూర్: జాతీయ జెండా ఆవిష్కరణ



కమాన్‌పూర్: పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ



ఫెర్టిలైజర్‌సిటీ: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



సుల్తానాబాద్‌రూరల్: బాహుమతి ప్రదానం



ఓదెల: భవనం ప్రారంభిస్తున్న ఎంపీపీ రేణుకాదేవి



పాలకుర్తి: మారేడుపల్లిలో పుస్తకాలు పంపిణీ

రామగుండం/మంథని/జ్యోతినగర్/యైటింక్లయిన్‌కాలనీ/కాల్వశ్రీరాంపూర్/ఎలిగేడు/కమాన్‌పూర్/ఓదెల/పాలకుర్తి/ఫెర్టిలైజర్‌సిటీ/సుల్తానాబాద్‌రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. జాతీయ జెండాలు ఎగురవేశారు. పాఠశాలలకు విరాళాలు అందిస్తున్న దాతలను, స్కూల్ టాపర్లను సన్మానించారు. మన ఊరు మన బడి పథకంలో నిర్మించిన పాఠశాలలను ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రారంభించారు. ఉత్తమ టీచర్లను సన్మానించారు.

మెరుగైన ఫలితాలు సాధించాం

- కలెక్టర్ సంగీత
- విద్యార్థులకు బహుమతి ప్రదానం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ప్రభుత్వ విద్యాలయాల విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించారని కలెక్టర్ సంగీత అన్నారు. విద్యారంగంలో సాధించిన విజయాలు, జరిగిన మార్పుల వివరాలతో రూపొందించిన వీడియోను కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రదర్శించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధించడం, ప్రణాళికబద్ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారా విద్యార్థులు మంచి మార్కులు సాధించారన్నారు. టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన 68మంది విద్యార్థులను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, కలెక్టర్ సత్కరించారు. స్థానికసంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్, గ్రంథాలయసంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, జెడ్పీటీసీలు రామ్మూర్తి, బొద్దుల లక్ష్మణ్, కందుల సంధ్యారాణి, డీఈఓ మాధవి, ఇంటర్‌నోడల్ ఆఫీసర్ కల్పన, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ లక్ష్మీనర్సయ్య తదితరులున్నారు.

కూరగాయల మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సీపీఐ నాయకులు మార్కెట్ ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్, రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, నగర సహాయ కార్యదర్శి తాళ్లపల్లి మల్లయ్య, హమాలీ కార్మిక సంఘం నాయకులు ఎం.ఎ.గౌస్ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కనకరాజ్ మాట్లాడుతూ మార్కెట్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో మార్కెట్‌కు వచ్చే ప్రజలతోపాటు ఆసాములు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రూ.కోట్ల నిధులు వెచ్చించి మార్కెట్ నిర్మించినప్పటికీ రైతులకు కనీసం విశ్రాంతి గదులు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే పార్కింగ్ స్థలం లేకపోవడంతో మార్కెట్‌కు వచ్చే ప్రజలు వాహనాలను రోడ్డుపై పెట్టుకోవాల్సి వస్తోందన్నారు. ఉన్న కొద్దిపాటి పార్కింగ్ స్థలాన్ని మార్కెట్‌లోని వ్యాపారస్తులు ఆక్రమించుకుంటున్నారని, దీనిపై మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యాపారస్తులతోపాటు మార్కెట్‌కు వచ్చే ప్రజల కోసం తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. కంపు కొడుతున్న మార్కెట్‌ను నిత్యం శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మార్కాపురి సూర్య, బూడిద మల్లేశ్, గాలిపెల్లి సతీశ్, రవి పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై వెంకటకృష్ణ

జూలపల్లి: యువత మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు, దూరంగా ఉండాలని జీవితంలో ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఎస్సై వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని అబ్బాపూర్‌లో మంగళవారం సాయంత్రం గ్రామస్తులతో, యువకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీల పేరుతో వచ్చే మెసేజ్‌లు, ఫోన్లకు స్పందించొద్దని సూచించారు. సర్పంచ్ ఈర్ల మల్లేశం, మాజీ ఎంపీటీసీ కచ్చు బీరయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు జంగం సతీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోడెలను తరలిస్తున్న వాహనం పట్టివేత



కోడెలను గోశాలకు అప్పగిస్తున్న పోలీసులు

జ్యోతినగర్: క్రషర్‌నగర్ మీదుగా మంగళవారం కోడెలను తరలిస్తున్న వాహనాన్ని సామాజిక కార్యకర్త అరవింద్‌స్వామితోపాటు పలువురు పట్టుకొని, ఎన్టీపీసీ పోలీసులు అప్పగించారు. వారు కోడెలను పరిశీలించి, వెటర్నరీ డాక్టర్‌కు సమాచారం ఇచ్చారు. తదుపరి విచారణ నిమిత్తం పోలీసులు, మున్సిపల్ సిబ్బంది వాటిని అన్నపూర్ణకాలనీలోని గోశాలకు తరలించారు.

విద్య, వైద్యం, ఉపాధి కల్పనే బీఎస్పీ ధ్యేయం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉష

కాల్వశ్రీరాంపూర్: విద్య, వైద్యం, ఉపాధి కల్పనే ధ్యేయంగా బీఎస్పీ ప్రజల ముందుకు వచ్చిందని ఆ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో 'మన ఊరు మన ఉషక్క' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇంటింటికీ వెళ్లి పార్టీ కోసం విరాళాలు సేకరించారు. పలు పార్టీలకు చెందిన మహిళలు, యువకులు పార్టీలో చేరగా వారందరికీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్, కోశాధికారి ఎండీ రియాజ్, మండల అధ్యక్షుడు రవికుమార్, మహిళా కన్వీనర్ శారద, నాయకులు అశోక్, అజీమ్, షాదిక్, కిరణ్ పాల్గొన్నారు.

కెమెరాల ఉపయోగంపై సెమినార్



సెమినార్‌లో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు

కోల్‌సిటీ: గోదావరిఖని శ్రీనగర్ కాలనీలోని ఓ హోటల్‌లో మంగళవారం కెమెరాల వాడకం తీరు, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఫొటోగ్రాఫర్లు నైపుణ్యం సాధించడానికి తెలుసుకోవాల్సిన మెలకువలపై గోదావరిఖని ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెనాక్ కంపెనీ మంగళవారం సెమినార్ నిర్వహించింది. సదరు కంపెనీ ప్రతినిధి ఫరూక్ ఫొటోగ్రాఫర్లకు అవగాహన కల్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్, ప్రధాన కార్యదర్శి శనిగరపు మల్లేశ్, కోశాధికారి బండారి ప్రసాద్, ఎలగందుల శ్రీనివాస్, శ్రీనివాస్, రామహబూబ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనతోనే మేలు



మాట్లాడుతున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు మేలు కలిగిందని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. జిల్లాకేంద్రంలో ఆయన ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, వారి మద్దతు కూడగట్టాలని, వచ్చే ఎన్నికల్లో పార్టీఅధికారం లోకొచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌లో భాగంగా రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటిషన్ పోటీలను జూలై 2న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సుగల వారు 76618 99899నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇస్తే ఓ మెసేజ్ వస్తుందని, అందులో 15506 నంబరు ఎంట్రీ చేయాలని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు ఉంటాయన్నారు. నాయకులు సారయ్యగౌడ్, శ్రీనివాస్, ప్రకాశ్‌రావు, మహేందర్, సంపత్, అబ్బయ్య, సతీష్, మస్రత్, తూముల సుభాష్, విజయేందర్, శ్రీమాన్ తదితరులున్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నారాయణపూర్‌లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇంటి నిర్మాణం కోసం పేదలకు రూ.5లక్షల ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీకి మద్దతివ్వాలని కోరారు. నాయకులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు డిమాండ్ చేశారు. కార్మికులు సమ్మె చేస్తున్న శిబిరాన్ని మంగళవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలిపించి బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. నాయకులు మస్రత్, శ్రీనివాస్, సంపత్, మహేందర్, సీపీఐ జిల్లా కార్యదర్శి సదానందం ఉన్నారు.

జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో ఎన్టీపీసీ ఈడీ సునీల్‌కుమార్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లో మంగళవారం రాత్రి వైకుంఠపురం హరిహర దేవాలయ ఆవరణలోని జగన్నాథ ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ పాల్గొని పూజలు చేశారు.

ప్రమాదకరంగా ఉన్న వృక్షం తొలగింపు



వృక్షాన్ని తొలగిస్తున్న సంబంధిత సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

జ్యోతినగర్: రోడ్డు పక్కన ఎండిపోయిన చెట్టు ఎప్పుడు కూలుతుందో అని రాకపోకలు సాగించే వారు భయాందోళన చెందుతున్నారు. కాగా 'సాక్షి'లో 19న 'ప్రమాదకరంగా ఎండిన వృక్షం' కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు టీటీఎస్‌లోని సంధింత విభాగం వారు భారీ క్రేన్‌తో మంగళవారం ఎండిపోయిన వృక్షాన్ని తొలగించారు.

సైబర్‌క్రైం నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ జగదీష్

సుల్తానాబాద్‌రూరల్: సైబర్ క్రైం నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ జగదీష్ అన్నారు. సుల్తానాబాద్ మండలం మియాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై నేరుగా పోలీస్‌స్టేషన్‌లో గానీ, షీటీం క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలన్నారు. ఎంపీటీసీ ఫక్కీర్‌యాదవ్, ఎస్సై విజేందర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం

కమాన్‌పూర్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని జేఎన్‌టీయూ హైదరాబాద్ ఆదేశాల మేరకు మంథని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కళాశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, మైనింగ్ మోడల్స్ తయారీపై పోటీలు నిర్వహించగా గెలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈఈఈ విభాగ అధిపతి ఆర్.దుర్గారావు, ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, టీచింగ్ పాల్గొన్నారు.

మోడల్ విద్యాలయం సందర్శన

రామగుండం: రామగుండం ఆదర్శ విద్యాలయాన్ని మంగళవారం హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితాశ్రీ మంగళవారం సందర్శించారు. కాగా ప్రిన్సిపాల్ సారాతస్నీమ్ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన వివరాలు, ఇతరత్రా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీకే రామయ్య క్యాంపు నుంచి లింగాపూర్ వరకు రహదారి నిర్మాణం లేక స్కూల్ బస్సులో వచ్చే విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కలెక్టర్ సంగీత రోడ్డు సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

సంక్షిప్త వార్తలు

✦ఎల్లమ్మ గుడికి మైక్‌సెట్ బహూకరణ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం ముత్తారం గ్రామంలోని రేణుకాఎల్లమ్మ ఆలయానికి నాయకుడు వేగోళపు సదయ్యగౌడ్ మంగళవారం మైక్‌సెట్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సదయ్యను సత్కరించారు. నాయకులు లక్ష్మీరాజం, జంపయ్య, శ్రీనివాస్, మనోజ్, రఘు, సుమన్, సతీశ్ ఉన్నారు.

✦దరఖాస్తుల గడువు పెంచండి

మంథని: బీసీ కులాల ఆర్థికసాయం చేసుకునేందుకు మరి కొన్నిరోజుల గడువు పెంచాలని కాంగ్రెస్ నాయకులు మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

✦ఆలయాలకు దీపదూప నైవేద్యం పథకం వర్తింపు

మంథని: పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలోని 18 దేవాలయాలకు దూప దీప నేవేద్య పథకం వర్తింపజేస్తున్నట్లు మంథని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

✦బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజేందర్

మంథని: బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన వీరబోయిన రాజేందర్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం రాజేందర్‌ను పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అభినందించారు.

✦మృతుల కుటుంబాలకు పరామర్శ

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని కల్వచర్ల, సెంటినరీకాలనీ, లద్నాపూర్, రాజాపూర్‌లో ఇటీవల పలువురు మృతి చెందారు. కాగా మృతుల కుటుంబాలను మంగళవారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పరామర్శించారు. కమాన్‌పూర్ ఏఎంసీ చైర్మన్ దాసరి రాయలింగు, జెడ్పీటీసీ శారద, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, పీవీరావు, కుమార్, వెంకటరమణారెడ్డి ఉన్నారు.

✦పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

కోల్‌సిటీ: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి మొక్కలు నాటాలని రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కళాశాలలో మొక్కలు నాటారు.

✦నియామకం

కాల్వశ్రీరాంపూర్: కేసీఆర్ సేవాదళం మండల అధ్యక్షుడిగా మంగళవారం పోతరవేన వీరేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు రాజు వీరేశంకు నియామక పత్రం అందించారు.

విద్య, పౌష్టికాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రమేశ్

కమాన్‌పూర్: మంథని జేఎన్‌టీయూ కళాశాల ఆధ్వర్యంలో రామగిరి మండలం పన్నూర్‌లో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా మంగళవారం గ్రామంలో వలంటీర్లు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వలంటీర్లు గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి విద్య, పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు రాకుండా ఉంటాయని సూచించారు. ముందుగా గ్రామంలో చేపట్టిన ర్యాలీని ఎంపీడీవో రమేశ్ ప్రారంభించారు. సర్పంచ్ అల్లం పద్మ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చెరువు శ్రీధర్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారి దుర్గారావు, ఎంపీవో భాస్కర్, కోఆర్డినేటర్ శ్రీధర్, పీడీ పింగిళి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

✦మహిళపై గొడ్డలితో దాడి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాకకు చెందిన సున్నం ఎల్లమ్మపై అదే ప్రాంతానికి చెందిన కుమ్మరి మహేందర్ గొడ్డలితో దాడికి పాల్పడ్డాడని గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు. ఎల్లమ్మ భర్త, సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మధునయ్య తమ ఇంటి వద్ద ఉన్న చెట్టును నరికి కొమ్మలను కుప్పగా వేశాడు. ఆ కొమ్మలను మహేందర్ ఎవరికీ తెలియకుండా తీసుకెళ్తున్నాడు. మంగళవారం రాత్రి మహేందర్ కొమ్మలు తీసుకెళ్తుండగా మధునయ్య గమనించి ప్రశ్నించాడు. మధునయ్యను తోసేయగా కింద పడి అరవడంతో ఎల్లమ్మతోపాటు చుట్టుపక్కలవారు వచ్చారు. తన భర్తను ఎందుకు కొట్టావని ఎల్లమ్మ అడుగుతుండగానే గొడ్డలితో దాడి చేశఋడు. గాయపడిన ఎల్లమ్మను సింగరేణి ఏరియా ఆసుపత్రికి 108లో తరలించారు. మధునయ్య ఫిర్యాదు మేరకు మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

✦ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

గోదావరిఖని: బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో జనగామ గ్రామానికి చెందిన రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై కమలాకర్ తెలిపారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో బైక్ ఢీకొనడంతో రేగుల అనిల్‌కుమార్ గాయపడ్డారు. అనిల్‌కుమార్ అన్న సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

✦వేర్వేరు కేసుల్లో ఐదుగురిపై కేసు

గోదావరిఖని: ఓ యువతిని మోసం చేసినందుకుగాను స్థానిక చంద్రబాబుకాలనీకి చెందిన నలుగురుపై కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై స్వామి తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దాసి శివకుమార్, దాసి సందేష్, దాసి రాజ్‌కుమార్, దాసి లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మరో ఘటనలో ఖమ్మం జిల్లా గన్నవరానికి చెందిన వాసంశెట్టి వీరబాబుపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టినట్లు ఎస్సై సమ్మయ్య తెలిపారు. స్థానిక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని వీరబాబు మోసం చేశాడని, బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.